నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

మంచిర్యాల కుమ్రం భీం ఆసిఫాబాద్

ఆదివారం 19 నవంబర్ 2023
SUNDAY, NOVEMBER 19, 2023

MANCHERIAL
KUMURAM BHEEM ASIFABAD

పేజీలు PAGES : 12




# ధరణిపై కాంగ్రెస్ కుట్ర

..6లో..

## పోర్టల్‌ను రద్దు చేయాలని కుతంత్రాలు పన్నుతున్న హస్తం పార్టీ

- పూర్తిస్థాయిలో బలాన్ని చేకూరుస్తున్న భట్టి విక్రమార్క వ్యాఖ్యలు
- అదే జరిగితే.. పాత కథే పునరావృతమయ్యే అవకాశం
- అవే పైరవీలు, లంచాలు.. అదే పటేల్, పట్వారీ వ్యవస్థ..
- రెవెన్యూ సంస్కరణలు తుడిచిపెట్టుకుపోయే ప్రమాదం
- ఒకరి భూమి.. మరొకరికి రాసి తాకట్టు పెట్టే ప్రయత్నం
- కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై కర్షకుల మండిపాటు
- కేసీఆర్ ప్రవేశపెట్టిన ధరణే బాగుందంటోన్న కర్షకలోకం

"ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తాం. రెవెన్యూ రికార్డుల్లో పాత కాలం నాటి పట్టేదారు, అనుభవదారు, మన్యందారు కాలాలు చేరుస్తాం. కౌలుదారు పేరును రికార్డుల్లో కచ్చితంగా రికార్డు చేస్తాం. రైతు తన భూమిని కౌలుకు ఇవ్వాలనుకుంటే కౌలుదారుతో రాతపూర్వకంగా ఒప్పందం చేసుకోవాలని చట్టం తెస్తాం. గతంలో ఏ చట్టాల ద్వారా ఎవరెవరికీ భూమి మీద హక్కులు వచ్చాయో వాటన్నింటినీ తిరిగి తెస్తాం.'' అని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేసిన ప్రకటనపై రైతులోకం మండిపడుతున్నది. అలా జరిగితే పైరవీలు, లంచాలు మళ్లీ పుట్టుకొస్తాయని.. పటేల్, పట్వారీ వ్యవస్థ వచ్చి సమస్యలు, వేధింపులు తప్పవని పాత రోజులను గుర్తు చేసుకుంటున్నారు. సీఎం కేసీఆర్ మూడేండ్లు కష్టపడి ధరణిని తీసుకొస్తే బంగాళాఖాతంలో వేస్తామని ఒకరు, రద్దు చేస్తామని మరొకరు ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాకు సులువుగా, వేగంగా 20 నిమిషాల్లో క్రయ, విక్రయాలు పూర్తవుతున్నాయని, ధరణే ఉండాలని రైతన్నలు ముక్తకంఠంతో నినదిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులను పీక్కతిన్న కాంగ్రెస్ కుట్రలు తిప్పికొడుతామని, ఓటుతో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు.

- ఆదిలాబాద్, నవంబర్ 18(నమస్తే తెలంగాణ)

### కాంగ్రెస్‌నే బంగాళా ఖాతంలో వేస్తాం..

ధరణి పోర్టల్‌తో మా భూములకు రక్షణ కలిగింది. భూములు అమ్మాలన్నా, కొనాలన్నా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసిన తర్వాత ఇరవై నిమిషాల్లోనే పని అయిపోతున్నది. గతంల కాంగ్రెస్ పాలనలో భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ విషయంలో వీఆర్‌ఏ, వీఆర్‌వో, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ఏండ్లకేండ్లు తిరగాల్సి వచ్చేది. పైసలు ఇస్తేగాని పని అయ్యేది కాదు. ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తే పటేల్, పట్వారీ వ్యవస్థ తీసుకురావడానికి కాంగ్రెస్ కుట్రలు పన్నుతున్నది. ధరణిని రద్దు చేస్తామని చెబుతున్న కాంగ్రెస్ బంగాళాఖాతంలో వేస్తాం.

- భూపాల్, రైతు, జైనథ్ మండలం, ఆదిలాబాద్ జిల్లా



## తెలంగాణ సర్కారే ఆదుకుంది..

చిన్న కొడుకు సుమన్.. తెలంగాణ కోసం సచ్చిపోయిండు. చెట్టంత కొడుకు లేడని గుర్తుకొచ్చిన ప్రతిసారి ఏం తోచది. వాడికున్న ఆలోచన మా ఇంట్లో ఎవ్వరికీ లేదు. చిన్న వయసులోనే నలుగురి కోసం ఆలోచించేటోడు. ఎప్పుడు చూసినా తెలంగాణ గురించే మాట్లాడేటోడు. సెలవులకు ఇంటికొచ్చిండంటే సాలు తెలంగాణ మీద ఏం జరుగుతున్నదనే వార్తలల్ల చూసేటోడు. వార్తలు పెట్టొద్దు అంటే వినేటోడు కాదు. సీఎం కేసీఆర్ సారు మా కుటుంబాన్ని ఆదుకున్నడు. రూ.10 లక్షలిచ్చిండు. మా పెద్ద కొడుక్కి ప్రభుత్వ ఉద్యోగమిచ్చిండు. కేసీఆర్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటం.

- కళావతి-తిరుపతి, అమరుడు సుమన్ తల్లిదండ్రులు.

# సారీతో సరి!

## నరహంతక కాంగ్రెస్ పార్టీ..



- తెలంగాణ కోసం కొట్లాడినోళ్ల ప్రాణం తీసిన పుణ్యం చేతు పార్టీదే..
- ఉమ్మడి ఆదిలాబాద్‌లో 27 మంది ప్రాణత్యాగం
- కాంగ్రెస్ తీరుతో తెలంగాణ రాదేమోననే ఆత్మహత్యలు
- చావులకు తామే కారణమని సారీ చెప్పి వదిలేసిన కాంగ్రెస్ నాయకుడు చిదంబరం
- రూ.10 లక్షల ఆర్థిక సాయం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిచ్చి ఆదుకున్న తెలంగాణ ప్రభుత్వం

'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కావాలే.. ఆంధ్రోళ్ల పెత్తనం పోయి మా ఉద్యోగాలు మాకు రావాలే.. బీడుబడ్డ మా పొలాలకు నీళ్లు రావాలే.. ఇవన్నీ కావాలంటే ఉద్యమం చేయాలే..'' అని నాటి తెలంగాణ ఉద్యమ రథసారథి, సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు యావత్ తెలంగాణ కదిలింది. ఊరూవాడా ఏకమవడంతో తెలంగాణ నినాదం తారాస్థాయికి వెళ్లింది. నాటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించలేదు. రాష్ట్ర అవతరణకు అడ్డంకులు తొలిగిపోయాయి అనుకునే లోగా ఆంధ్రోళ్లు కాళ్లల్లో కట్టెపెట్టడం.. కాంగ్రెస్ అధిష్టానాన్ని కలిసి తెలంగాణ ఇస్తే తాము రాజీనామాలు చేస్తామని బెదిరించడం.. ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కుట్రలు చేయడంతో మనస్తాపానికి గురై తెలంగాణ బిడ్డలు ప్రాణత్యాగం చేసుకున్నరు. 'ఎంత కొట్లాడుతున్నా కాంగ్రెసోళ్లు తెలంగాణ రానియ్యరు.. మాకు ఉద్యోగాలు రానియ్యరు..' అని లెటర్లు రాసి మరీ వందలాది మంది ఆత్మహత్యలు చేసుకున్నరు. ఆ మరణాలను చూసి చలించిన ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ కోసం ఇగ, ఒక్క ప్రాణం కూడా పోకూడదు.. ఏదైనా నాతో తేలిపోవాలే.. నేను సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో.. ఏదో ఒకటి జరగాలని ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. అదే చివరి ఘట్టంగా ఆనాటి కేంద్ర మంత్రి పీ.చిదంబరం తెలంగాణకు అనుకూలమైన ప్రకటన చేశారు. దీక్ష విరమించాక తెలంగాణ ప్రకటనను వెనక్కి తీసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురై తెలంగాణవాదులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 27 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒక ప్రకటన చేసి రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది తెలంగాణ బిడ్డలను పొట్టన పెట్టుకున్న నరహంతక కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా అదే చిదంబరం తాజాగా.. తెలంగాణ అమరుల చావులకు తామే కారణమని.. క్షమించండి అని చిన్న సారీతో సరిపెట్టారు. దీనిపై తెలంగాణ అమరవీరుల కుటుంబాలు మండిపడుతున్నాయి. మా వాళ్లను పొట్టన పెట్టుకొని సారి చెప్తే క్షమిస్తామనుకుంటున్నారా.. అని నిలదీస్తున్నారు.

- మంచిర్యాల, నవంబర్ 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి)

### తెలంగాణ రాదనే బెంగతో ఆత్మబలిదానం

అది డిసెంబర్ 2009.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఇస్తున్నట్లు ప్రకటించింది. యావత్ తెలంగాణ సంబురాల్లో మునిగింది. అప్పుడే.. అప్పటి సమైక్య పాలకుల కుతంత్రాలతో ప్రత్యేక రాష్ట్ర ప్రకటనపై కేంద్రం వెనక్కి తగ్గింది. ఇగ, తెలంగాణ రాదేమోనని యువతీయువకులు ఆత్మబలిదానాలు చేసుకుంటున్నరు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని కోనూర్‌కు చెందిన బుద్దె సుమన్ స్థానికంగా క్రికెట్ ఆడుతూ.. 'తెలంగాణ వస్తేనే మన బతుకులు బాగుపడుతయ్.. మనకు ఉద్యోగాలు వస్తయ్.. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడూ తెలంగాణ నినాదం చేయలేమంటూ' స్నేహితులతో వాదించిన సుమన్.. ఇంటికి వచ్చిన కాసేపటికే టీవీలో వార్తలు చూస్తూ పురుగుల మందుతాగిండు. జై తెలంగాణ నినాదాలు చేస్తూ కుప్పకూలిండు. కుటుంబ సభ్యులు దవాఖానకు తీసుకుపోతుంటే..ఇంత పని చేసినవ్ బిడ్డా.. అని అడిగితే.. 'నా చావుతోనైనా తెలంగాణ వస్తదేమో.. నా అసొంటోళ్లకు చాలా మందికి ఉద్యోగాలు వస్తయ్..' అని చివరి మాటలు చెప్పిన సుమన్ మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచిండు. సుమన్ కలలుగన్న తెలంగాణ.. ఇప్పుడు కండ్ల ముందు కనిపిస్తున్నదని కుటుంబ సభ్యులు తెలిపారు.

# పల్లె పల్లెనా ప్రచార హోరు

- ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు, కుటుంబ సభ్యుల విస్తృత పర్యటన
- కారు గుర్తుకు ఓటెయ్యాలని అభ్యర్థన
- జోరుగా చేరికలు.. పెరుగుతున్న మద్దతు

..12లో

భీమారం : బూర్గుపల్లిలో భారీ గజమాలతో బాల్క సుమన్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు, కార్యకర్తలు

